మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 309
పేజీలు : 3

శనివారం-13 జూన్, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ







# తెలంగాణలో పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది




## ఆర్వో బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారు

- ఓట్ చోరీ లేకుంటే సీట్ చోరీ మాత్రమే బీజేపీకి తెలుసు

**టీ మీడియా, జూన్ 12, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్?ఛార్జి మీనాక్షి నటరాజన్? రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ, తెలంగాణలో పవన్? కల్యాణ్? పర్యటన, పోటీ సహా బీజేపీ నేతల తీరుపై సీఎం రేవంత్?రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. తనకు హిట్లర్? స్ఫూర్తని జరుగుతున్న ప్రచారంపై స్పష్టత నిచ్చారు.

**ఇప్పుడు సీట్ చోరీ కూడా మట్నదలుపెట్టింది**

ఇప్పటి వరకు బీజేపీ ఓటు చోరీ మాత్రమే చేసిందని, ఇప్పుడు సీట్ చోరీ కూడా మట్నదలుపెట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్? తెలంగాణ వ్యవహారాల ఇన్?ఛార్జి మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదన్న రేవంత్?రెడ్డి, ఇందులో రిటర్నింగ్ అధికారి కమలం పార్టీ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు.

**కిమ్ లాగనే బీజేపీ నేతలు తీరు**

బీజేపీ ఇప్పటిదాకా గాడ్సేను ఆదర్శంగా తీసుకుందని అనుకున్నామని, అయితే ఇప్పుడు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్?ను ఆదర్శంగా తీసుకుందంటూ సీఎం వ్యాఖ్యానించారు. కిమ్ లాగనే బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఉత్తరకొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, కానీ ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. సంఖ్యా బలం లేకపోయినా మధ్యప్రదేశ్‌లో మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందని రేవంత్?రెడ్డి విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి నంబర్ లేకపోయినా, పోటీలో ఎందుకు నిల్చున్నారో చెప్పాలని డిమాండ్? చేశారు. ఈ ఘటనతో అటు ప్రజాస్వామ్య వ్యతిరేకిగా, ఇటు మహిళా వ్యతిరేకిగా బీజేపీ నిలబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం నుంచి బయటపడేందుకే ఆ పార్టీ తమపై నేరపూరిత దాడికి దిగిందన్నారు.

**తెలంగాణలో పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది**

తెలంగాణకు వచ్చివెళ్లేందుకు, పోటీ చేసేందుకు జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?కు పూర్తి స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్?రెడ్డి స్పష్టం చేశారు. అయితే ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్‌పై మంత్రులు మాట్లాడారని చెప్పుకొచ్చారు. శాంతి భద్రతల కారణంతోనే పవన్ ఇటీవల తలపెట్టిన మీటింగ్?కు అనుమతి ఇవ్వలేదని వివరించారు. ఏపీలో జగన్ సభలకు ఎందుకు అనుమతి ఇవ్వట్లేదో పవన్ చెప్పాలని డిమాండ్? చేశారు. ఆంధ్రాలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదని రేవంత్?రెడ్డి ఆరోపించారు.

**ఎప్పుడూ చెప్పలేదు**

హిట్లర్ తనకు ఆదర్శమని ఎప్పుడూ చెప్పలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ఎవరైనా హిట్లర్ ఆదర్శమని అంటారా అని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు.

**కిషన్‌రెడ్డి కారణం**

తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్?రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ చెప్పినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డితో మాట్లాడి అడ్డుకున్నట్లు కేటీఆర్ ప్రకటించారని సీఎం అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డును కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం ఆరోపించారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డి కారణమని విమర్శించారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలని సవాల్? విసిరారు. ఎవరి వద్ద తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే తనకు చెప్పారని రేవంత్? అన్నారు. పోలవరం కోసం 4 మండలాలను ఏపీలో కలిపారని, అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా అని నిలదీశారు. మహారాష్ట్రను ఒప్పించే వరకు కేబినెట్‌కు రానని కిషన్‌రెడ్డి చెప్పలేరా అని ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తెలంగాణ కోసం ప్రధానితో కిషన్‌రెడ్డి ఒక్కసారైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి ఉన్న 8 మంది ఎంపీలంతా గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా అని రేవంత్?రెడ్డి అన్నారు.

## భారత షూటింగ్ దిగ్గజం జస్పాల్ రాణా కన్నుమూత

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**



ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, షఉటర్ అయిన జస్పాల్ రాణా కన్నుమూశారు. అతని వయసు 49 ఏళ్లు. ఆయన పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ చారిత్రాత్మక డబుల్ కాంస్య పతకాలు సాధించడంలో కోచ్‌గా మార్గదర్శకత్వం వహించారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కలికేష్ నారాయణ్ సింగ్ డియో ప్రకారం, రాణా శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. భారత పిస్టల్ షఉటర్లకు 'హై-పెర్ఫార్మెన్స్ కోచ్'గా వ్యవహరిస్తున్న రాణా మ్యూనిచ్‌లోని ఐ ఎస్ ఎస్ ఎఫ్ వరల్డ్ కప్ నుంచి భారత్‌కు తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. న్యూఢిల్లీకి చేరుకున్న తర్వాత, ఆయనను సాకేత్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన చికిత్స పొందారు. వైద్యులు గుండె రక్తనాళంలో అడ్డంకిని గుర్తించి, స్టెంట్‌ను వేశారు. రాబోయే రోజుల్లో మరో స్టెంట్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుందని భావించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని తొలుత వార్తలు వచ్చినప్పటికీ, శుక్రవారం ఉదయం ఆయన మరణవార్త వెలువడింది. భారతదేశంలో అత్యంత గౌరవనీయులైన కోచ్‌లలో ఒకరిగా మారడానికి చాలా కాలం ముందే, దేశం గర్వించదగ్గ అత్యుత్తమ పిస్టల్ షఉటర్లలో ఒకరిగా రాణా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్నారు. 1976 జూన్ 28న ఉత్తరాఖండ్‌లో జన్మించిన రాణా, 1994లో అంతర్జాతీయ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు. మిలాన్‌లో జరిగిన ప్రపంచ షఉటింగ్ ఛాంపియన్‌షిప్‌లో, ఆయన జూనియర్ విభాగంలో ప్రపంచ రికార్డు స్కోరుతో స్వర్ణ పతకాన్ని సాధించారు. అదే ఏడాది ఆసియా క్రీడలలో 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ విభాగంలోనూ స్వర్ణం గెలుచుకోవడం ద్వారా, అత్యున్నత స్థాయిలో దశాబ్దానికి పైగా కొనసాగిన తన క్రీడా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2006లో దోహాలో జరిగిన ఆసియా క్రీడలలో అతను మూడు స్వర్ణ పతకాలు గెలుచుకుని, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డును సమం చేయడం అతని అత్యంత చిరస్మరణీయ ప్రదర్శన. అతని కెరీర్ ప్రారంభ దశలోనే విజయం లభించింది. రానా 18 ఏళ్ల వయసులో అర్జున అవార్డును అందుకున్నాడు, ఆ తర్వాత మూడేళ్లకు పద్మశ్రీ పురస్కారంతో సత్కరించబడ్డాడు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే క్రీడా ప్రపంచం నలుమూలల నుండి నివాళులు వెల్లువెత్తాయి. రాణా మరణం పట్ల కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ట్రంప్ సర్కార్‌కు భారీ ఊరట

- 10శాతం టారిఫ్‌లు

**కొనసాగించవచ్చన్న న్యాయస్థానం**

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్? విధించిన టారిఫ్?లపై అక్కడి ఫెడరల్ కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. సుంకాలపై చట్టపరమైన సవాళ్లు కోర్టులో కొనసాగుతున్నంత కాలం, ఫిబ్రవరిలో విధించిన 10శాతం సుంకాన్ని అమెరికా ప్రభుత్వం వసూలు చేయడాన్ని సమర్థించింది. ప్రపంచవ్యాప్తంగా దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ విధించిన 10 శాతం గ్లోబల్ సుంకాలను వసూలును కొనసాగించవచ్చని కీలక తీర్పునిచ్చింది. కాగా, గతేడాది ప్రపంచ దేశాలపై అమెరికా 10 శాతం సుంకాలను విధించింది. అయితే, అవి చెల్లవని ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 2-1 తేడాతో తీర్పునిచ్చింది. దీంతో వాణిజ్య చట్టంలోని కొన్ని సెక్షన్లను ఉపయోగించి జులై 24 వరకు అమల్లో ఉండేలా తాత్కాలిక సుంకాలను ట్రంప్? విధించారు. ఈ నేపథ్యంలో రెండు వ్యాపార సంస్థలు ఇటీవల దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీంతో, అమెరికా రాజ్యాంగం ప్రకారం సుంకాలను నిర్ణయించే అధికారం కాంగ్రెస్?కు మాత్రమే ఉంటుందని న్యూయార్క్?లోని ఫెడరల్? కోర్టు స్పష్టం చేసింది. అధ్యక్షుడికి కాంగ్రెస్ కల్పించిన సుంకాల అధికార పరిధిని ట్రంప్ అతిక్రమించారని, ఆయన



విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని తేల్చి చెప్పింది. అయితే, ట్రంప్? సర్కార్? ఈ విషయంపై అప్పీల్? చేయగా, న్యాయస్థానం వారికి అనుకూలమైన తీర్పు వెలువరించింది. కాగా, ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉంది.

**ప్రపంచ దేశాలపై సుంకాల మోత**

ఇదిలా ఉండగా, గతంలోనూ సుంకాలతో ట్రంప్? ప్రపంచ దేశాలపై విరుచుకుపడ్డారు. ఇరాన్‌తో వాణిజ్యం జరిపే అన్ని దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ గతంలో ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం కూడా, ఇతర దేశాల నుంచి ఎలాగైనా సుంకాలు వసూలుచేయాలని నిర్ణయించుకున్న ట్రంప్ సెక్షన్ 301 అధికారాన్ని ప్రయోగించారు. భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద, భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ పేర్కొన్నారు.

**ఈ చట్టం అధికారాలు ఏమిటంటే!**

ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉపయోగించే ఆయుధమే ఈ సెక్షన్ 301 తెలుస్తోంది. దీని ద్వారా, తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనే విషయంపై ఈ చట్టం కింద అగ్రరాజ్యం దర్యాప్తు చేసేందుకు వీలుంటుంది. ఈ దర్యాప్తు, అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. అయితే, ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే, ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునే విధంగా ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.

**భారత్ వంటి మిత్రదేశంపైనా దర్యాప్తు చేపట్టడమా?**

అయితే, చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రదేశంపైనా దర్యాప్తు చేపట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ విధిస్తోన్న అధిక సుంకాలు, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది.

## పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

- సంక్షోభం వేళ కేంద్రం కీలక నిర్ణయం

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం వల్ల ఇంధన సరఫరా కష్టమవుతుండడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బదులుగా వారి అవసరాల కోసం ఇంధనాన్ని బల్క్ అమ్మకపు కేంద్రాల నుంచి పొందాలని సూచించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లోకి ఉంటుందని పేర్కొంది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ ఇంధనం నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యానికి ఆదేశాలిచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

**డీజిల్‌కు పెరిగిన డిమాండ్**

ధరల వ్యత్యాసం కారణంగా బల్క్ వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించడంతో కొన్ని ప్రాంతాలలో డీజిల్‌కు అసాధారణ డిమాండ్ పెరిగింది. దీంతో దేశ రాజధాని దిల్లీలోని పెట్రోల్ పంపుల వద్ద లీటరు డీజిల్ ధర రూ. 95.20 కాగా, బల్క్ సరఫరాదారుల వద్ద లీటర్ డీజిల్ ధర రూ. 134.50గా ఉంది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై కేంద్రం ఈ ఆంక్షలు విధించింది.

**ప్రభుత్వ రంగ బంకుల్లో పెరిగిన సేల్స్**

పశ్చిమాసియా సంక్షోభం తరువాత పెరిగిన ఇంధన ధరల నుంచి సాధారణ వినియోగదారులను కాపాడటానికి ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రిటైల్ ధరలను సర్దుబాటు చేయడంతో ఈ వ్యత్యాసం ఏర్పడింది. టెలికాం టవర్లు, విద్యుత్ ఉత్పత్తి, ఇతర ఫీడ్‌స్టాక్ అవసరాల కోసం డీజిల్‌ను ఉపయోగించే పరిశ్రమలు వంటి బల్క్ వినియోగదారులకు మార్కెట్ ధర వసూలు చేస్తుండగా, రిటైల్ అవుట్‌లెట్ల వద్ద ధరలు ఉత్పత్తి వ్యయం కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ధరలలోని ఈ వ్యత్యాసం వల్ల పెట్రోల్, డీజిల్‌ను అధిక రేట్లుకు విక్రయించే ప్రైవేట్ రంగ అవుట్‌లెట్లలో అమ్మకాలు తగ్గిపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థల పెట్రోల్ పంపుల్లో అమ్మకాలు పెరిగాయి.

**90రోజులపాటు ఆంక్షలు**

కాగా మే నెలలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లో పెట్రోల్ అమ్మకాలు 4.8 శాతం, డీజిల్ అమ్మకాలు 6.4 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో రిటైల్ సరఫరాకు అంతరాయం



కలగకుండా ఉండేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని వెల్లడించింది. అంతేగాకుండా పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశాలిచ్చింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని చెప్పింది. అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని ప్రకటించింది.

**తగు చర్యలకు అన్ని రాష్ట్రాలు, యూటీలకు ఆదేశాలు**

ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితి కారణంగా ఈ చర్య అవసరమైందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పరిస్థితి అంతర్జాతీయ పెట్రోలియం సరఫరా గొలుసులు, షిప్పింగ్ లాజిస్టిక్స్, పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతపై ప్రతికూల ప్రభావం చూపిందని స్పష్టం చేసింది. ఇంధన నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక సేకరణ, మళ్లింపు వంటి విషయానికి సంబంధించిన ఈ ఉత్తర్వును అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. పెట్రోల్, డీజిల్ సమాన లభ్యతను నిర్ధారించడం, నిల్వలు, మళ్లింపులను నివారించడం, దేశవ్యాప్తంగా నిరంతరాయ ఇంధన సరఫరాలను కొనసాగించడం ఈ చర్యల లక్ష్యమని పేర్కొంది.



## తుగ్లకాబాద్ భవనంలో అగ్నిప్రమాదం..

- ముగ్గురు సజీవ దహనం!

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**

దేశ రాజధాని ఢిల్లీలో వరుస అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల మాల్వీయా నగర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాద ఘటన మరువకముందే, శుక్రవారం (జూన్ 12) తెల్లవారుజామున తుగ్లకాబాద్ ప్రాంతంలో మరో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనంలో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. డీఎఫ్ఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు ఐదుగురిని సురక్షితంగా రక్షించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో భవనంలో ఉన్నవారిలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. మంటలు మరియు దట్టమైన పొగ

మిగతా 3లో..




# విమానాశ్రయాలకు ఫేక్ బాంబ్ కాల్స్, మెయిల్స్

- కఠినంగా వ్యవహరించనున్న సివిల్ ఏవియేషన్

**టీ మీడియా ,జూన్ 11 , ఢిల్లీ బ్యూరో :**
మే 21వ తేదీ 2026న తేదీన శంషాబాద్ ఎయిర్?పోర్ట్?కు ఉదయం 8 గంటల ప్రాంతంలో శంషాబాద్ కస్టమర్ సపోర్ట్ మెయిల్‌కు 3 మెసేజ్?లు వచ్చాయి. ఫలానా విమానాల్లో బాంబులు ఉన్నాయి. ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని దాని అర్థం. ఎయిర్?పోర్ట్?లోని బాంబ్ థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ మెంబర్స్ హుటాహుటిన ఆ విమానాల వద్దకు వెళ్లారు. ఆ విమానాలను వెంటనే రన్‌వేకు దూరంగా ఉంచాలంటూ పైలెట్లకు సూచించారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసి బాంబు లేదని నిర్ధారించడంతో ఊపిరి పీల్చుకున్నారు. విమానాల్లో బాంబులు పెట్టామంటూ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్స్, ఫోన్ల ద్వారా చేస్తున్న ఫేక్? బెదిరింపులకు ఉదాహరణలు ఇలా ఉన్నాయి. శంషాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, చెన్నై ఎయిర్?పోర్ట్?లకు తరచూ ఇలాంటివి వస్తున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు పౌరవిమానయాన సంస్థ అధికారులు సరికొత్త నిర్ణయాలు తీసుకున్నారు. ఫేక్ బెదిరింపు మెయిల్స్, కాల్స్ చేసినవారికి విమానంలో ప్రయాణించకుండా జీవితకాల నిషేధం విధించే యోచనలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతితో ఈ నిర్ణయాన్ని త్వరలో అమలు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించనున్నారు.

**భారీ జరిమానా, ఐదేళ్ల జైలు**
ఇండిగో సంక్షోభం అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి విమానాల రాకపోకలు కొంత సాధారణ స్థితికి చేరుకునే వాతావరణం కనిపిస్తుండగా



ఇదే సమయంలో దేశంలోని ప్రముఖమైన విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి – మే నెలల మధ్య వేర్వేరు ఎయిర్?పోర్టులకు 32 బెదిరింపు మెయిల్స్, కాల్స్ వచ్చాయి. బాంబు నిర్వీర్య విభాగం, పోలీసులు తనిఖీలు చేసి వాటిని ఉత్తుత్తి కాల్స్‌గా నిర్ధారించారు. దీనిపై స్పందించిన పౌరవిమానయాన సంస్థ ఉన్నతాధికారులు ఎయిర్ క్రాఫ్ట్(సెక్యూరిటీ), 2023 చట్టంలో కొన్ని నిబంధనలను సవరించారు. నిందితులకు రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించాలని, ఘటనల తీవ్రతను ఆధారంగా చేసుకుని ఐదేళ్ల జైలుశిక్ష విధించాలని తీర్మానించారు.

**సరదా కోసం :** ఉత్తుత్తి మెయిల్స్ చేస్తున్న వారి వివరాలను ఇంటెలిజెన్స్ వర్గాలు, పోలీస్‌లు ఆరా తీయగా 80 శాతం మంది వ్యక్తిగత అవసరాలకో సరదా తీర్చుకునేందుకో ఇలా చేస్తున్నారనే విషయం తెలిసింది. బెంగళూరు విమానాశ్రయంలోని ఓ విమానంలో బాంబుందని ఏప్రిల్ 8న ఓ మెయిల్ పెట్టారు. అధికారులు నిందితుడిని వెతికి పట్టుకోగా తాను ఎయిర్?పోర్ట్?కు వెళ్లడం లేట్ అవుతుందేమోనని ఇలా చేసినట్లు నిందితుడు ఒప్పుకొవడంతో అధికారులు ఆశ్చర్యపోయారు.
చెన్నై ఎయిర్?పోర్ట్?కు 2నెలల క్రితం ఓ బెదిరింపు కాల్ వచ్చింది. బెంగళూరు వెళ్తున్న విమానంలో బాంబుందని గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. గంటల్లోనే అతడిని నిఘావర్గాలు పట్టుకున్నాయి. గతంలో తాను విమానాశ్రయానికి రాగా పావుగంట ఆలస్యానికే చెక్-ఇన్ మూసేశారని, అందుకే ఇలా చేశానని అతడు చెప్పాడు. ఢిల్లీ ఎయిర్?పోర్ట్?కు రెండేళ్ల క్రితం ఓ మెయిల్ వచ్చింది. భద్రతా అధికారులు, పోలీసులు మెయిల్ ఐడీ ద్వారా అడ్రస్?ను గుర్తించగా 13 ఏళ్ల బాలుడు మెయిల్ పంపినట్టు గుర్తించారు. బాంబు బెదిరింపుతో విమానం ఆగిపోతే ఎలా ఉంటుందో తెలుసుకుందామని సరదాగా బెదిరింపు మెయిల్? పెట్టినట్టు పోలీసులకు చెప్పాడు. విమానయాన కంపెనీలకు తీవ్ర నష్టం : ఇది ఇలా ఉండగా విమానయాన కంపెనీలకు బెదిరింపు కాల్స్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా ముఖ్యమైన సమయం కూడా వృథా అవుతోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలనే ఆలోచనతో విమానయాన శాఖ నిషేధం విధించేటువంటి నిర్ణయాలను తీసుకోవడానికి సమాయత్తం అవుతుంది. దీంతో ఈ బెదిరింపు కాల్స్, మెయిల్స్?కు కొంత అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## పైసలు కొట్టు సింగరేణి క్వాటర్ పట్టు
## సింగరేణి క్వాటర్లలో పెరిగిప్రైవేట్ వ్యక్తులు

**టీ మీడియా, టీ మీడియా, జూన్ 12 , మంచిర్యాల బ్యూరో:**



శ్రీరాంపూర్ లో పనిచేస్తున్న కార్మికుల నివాస సౌకర్యం కోసం నిర్మించిన క్వాటర్లు ప్రైవేట్ వ్యక్తులకు ఎలా వెళ్తున్నాయి సింగరేణిలో పని చేసే కార్మికులకు పైన క్వాటర్ ఉంది నాకు ఆరోగ్యం బాగా లేదు నాకు ఆరోగ్య పరిస్థితి గమనించి క్రింద క్వాటర్ ఇవ్వాలని సింగరేణి అధికారులకు ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్న ఎలాంటి ఫలితం లేదు కానీ అదే క్రింద క్వాటర్ ఇవ్వాలని ఒక ప్రైవేట్ వ్యక్తి సింగరేణి కి ఎలాంటి సంబంధం లేని వ్యక్తి ఎమ్మెల్యే సిఫార్సు లేటర్ పట్టుకొని జనరల్ మేనేజర్ శ్రీరాంపూర్ ని కలిస్తే వారికి గోదావరి కాలనీలో ఎలా క్రింద క్వాటర్ ఇస్తారు ? మళ్ళీ అదే నెంబర్ గల క్వాటర్ కాలిగా ఉందని గనులపై మీరు మెడికల్ లో పెట్టుకోండి అని గనులపై నోటీసు బోర్డులో పెట్టడం వెనుక అంతర్యం ఏంటి? ఆ నెంబర్ గల క్వాటర్ కాలిగా ఉండాలి కానీ ఒక ప్రైవేట్ వ్యక్తి ఎలా ఉంటున్నాడు అతనికి ఎవరు ఇచ్చారు సింగరేణి ఎస్ అండ్ పీసీ వాళ్లు ఏమైనా డబ్బులు వసూలు చేసి వారికి ఇచ్చారా? లేఖ సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది నిద్రలో ఉన్నారా ? అని అర్థం కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఒక ప్రైవేట్ వ్యక్తి అంత దర్జాగా ఎలా తాళం వేసి ఉన్న క్వాటర్ లో ఎలా నివసిస్తాడు ఇది ఎవరి హస్తం ఉంది సింగరేణి కార్మికులు నివసించే క్వాటర్లో ప్రైవేట్ వ్యక్తి ఉంటూ తాగడం జల్సాలకు పాల్పడటం కార్మికుల కుటుంబాలకు రక్షణ కరువు అవుతుందని ప్రైవేట్ వ్యక్తులను కాలి చేపించాలని సింగరేణి కార్మిక కుటుంబాలు కోరుకుంటున్నాయిగతంలో ఈ విషయంపై జనరల్ మేనేజర్ శ్రీరాంపూర్ ని వివరణ కోరగా నేను కొత్తగా వచ్చాను నేను వచ్చిన నుండి ప్రైవేట్ వ్యక్తులకు ఒక్క క్వాటర్ కూడా ఇవ్వలేదని వారు తెలిపారు. ఇప్పుడు ఏమైందో అర్థం కావడం లేదు ఇప్పటికీ అయిన సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ స్పందించి సంబధిత అధికారులపై తగిన చర్యలను తీసుకోవాలని సింగరేణి కార్మికులు కోరుకుంటున్నారు.

# డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

**టీ మీడియా, టీ మీడియా, జూన్ 12 ముదిగొండ**




ఆడపిల్లల అక్రమ రవాణా, డ్రగ్స్, సైబర్ ట్రాఫికింగ్ పై గ్రామస్తులకు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఖమ్మం జిల్లా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, వెంకటాపురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ ఆడపిల్లల అక్రమ రవాణా అనేది ప్రపంచంలో 3వ స్థానంలో ఉందన్నారు. ప్రతిరోజూ ఎంతోమంది అమ్మాయిలు మహిళలు ఈ అక్రమ రవాణాకి గురివుతున్నారు. ముఖ్యంగా ప్రేమ పెళ్లి సినిమా అవకాశాలు, డబ్బు ఆశ చూపి వేరే ప్రదేశాలకు తీసుకెళ్లి అమ్ముతున్నారు.

**మహిళలు పిల్లలు జాగ్రత్తగా ఉండాలి**
సైబర్ ట్రాఫికింగ్ (ఆన్లైన్ మోసాలు ) ద్వారా చాలా పద్ధతుల్లో అప్స్, ఫేసుబుక్, ఇన్స్టాగ్రాం, స్నాప్ చాట్ లాంటి వాటి ద్వారా అమ్మాయిల ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. లింక్ లు క్లిక్ చేయడం ద్వారా అకౌంట్ నుండి డబ్బులు పోతున్నాయి వీటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. చదుకునే పిల్లలకు బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని చెప్పారు. ప్రజ్వల సంస్థ వ్యవస్థాపకులు పద్మ శ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 33,000 మంది అమ్మాయిలను కాపాడినట్టు తెలిపారు.
అనంతరం సర్పంచ్ శ్రీ కందుల బాలచందర్ మాట్లాడుతూ, నేటి యువత డ్రగ్స్, ఆల్కహాల్, సిగరెట్ వంటి వాటికి అలవాటు పడి జీవితం నాశనం చేసుకుంటున్నారు. ప్రతి ఒక్కరు వీటి జోలికి పోకుండా చదువు ఉద్యోగం పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గంట వెంకట్రావు, బీఎస్పీ మండల ప్రెసిడెంట్ బంక వీరబద్ర మహారాజ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# 'బ్లాక్ హిల్స్'గా కర్రె గుట్టలు

- పర్యాటక ప్రాంతంగా అడుగులు!

**టి మీడియా, జూన్ 12 ,హైదరాబాద్ బ్యూరో :**
తుపాకీ తూటాలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన కర్రె గుట్టల దండకారణ్యంలో నేడు ప్రశాంత వాతావరణం సంతరించుకుంది. గత ఏడాది వరకు మావోయిస్టుల కంచుకోట అయిన అడవులు, కొండలు, లోయలు నేడు పర్యాటక ప్రాంతాలుగా మారే దిశగా అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ అడవిని సరికొత్తగా మార్చనున్నారు. దానికి అనుగుణంగానే అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**బ్లాక్ హిల్స్ పేరుతో అభివృద్ధి**
కర్రె గుట్టలు పేరు చెప్పగానే మావోయిస్టులకు కేంద్ర బిందువుగా అందరికీ గుర్తుకువస్తుంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్? సరిహద్దుల్లో 50 కిలోమీటర్ల పొడవు, 37 కిలోమీటర్ల వెడల్పుతో సహజ సిద్ధంగా ఏర్పడ్డ ఈ గుట్టలను మావోయిస్టులు అడ్డాగా చేసుకుని తమ కార్యకలాపాలను సాగించారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పేరిట కర్రెగుట్టలను చుట్టుముట్టిన భద్రతా బలగాలు మావోయిస్టుల నుంచి ఈ గుట్టలకు విముక్తి కలిగించాయి. ఈ ఏడాది జనవరిలో కర్రెగుట్టల్లో భాగమైన పాముసూరు తడపలలో సీఆర్?పీఎఫ్? బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి 'బ్లాక్ హిల్స్' పేరుతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి.



**పూర్తైన రోడ్డు నిర్మాణం**
సుమారు రూ.40 కోట్ల వ్యయంతో వాజేడు మండలం మురుమూరు నుంచి తెలంగాణ సరిహద్దు తడపల వరకు 40 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం పూర్తి చేశారు. పలుచోట్ల భారీ గుట్టలను బాంబులతో పేల్చివేసి, రెండు గుట్టల నడుమ రహదారిని నిర్మించారు. ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారు.

**అడుగడుగునా భద్రతా బలగాల మోహరింపు**
మరోవైపు ఛత్తీస్‌గఢ్? రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ పూజారి కాంకేర్ నుంచి తడపల వరకు పది కిలోమీటర్ల రహదారి పనులను అక్కడి ప్రభుత్వం చేపట్టింది. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో సుమారు 500 మీటర్ల రహదారి నిర్మాణం పనులు అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయాయి. ఈ కొద్ది దూరం కూడా పూర్తయితే పూజారి కాంకేర్ నుంచి మురుమూరు వరకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రయాణించవచ్చు. దీంతో వెంకటాపురం వాజేడు మండలాల ప్రజలకు ఛత్తీస్‌గఢ్ ప్రయాణం తేలికవుతుంది. భద్రతా బలగాల తుపాకీ నీడన జోరుగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. పనులు సాగుతున్న 40 కిలోమీటర్ల మేర అడుగడుగునా భద్రతా బలగాలు మోహరించాయి. ప్రస్తుతం మట్టి రోడ్లు పూర్తయ్యాయి. వర్షాకాలం తర్వాత వాగులు, వంకలపై వంతెనలను నిర్మించి బీటీ రోడ్ల పనులను చేపట్టనున్నారు.

**సుందరంగా మారనున్న కర్రెగుట్టలు**
ఈ ప్రాంతాన్ని అటవీ శాఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ఇప్పటికే కొన్ని ఎంపిక చేసిన స్థలాల్లో వ్యూ పాయింట్లను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. సుందరమైన లోయలు, జల పాతాలతో అద్భుతమైన ప్రదేశాలు ఈ కర్రెగుట్టల సొంతం. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయి పర్యాటక కేంద్రానికి కావలసిన వసతులు పూర్తయినట్లయితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. రహదారి సౌకర్యాలు కలుగుతుండటంతో ఆయా ప్రాంతాల గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్

**టీ మీడియా, జూన్ 12, పెబ్బేరు:**



పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డ్ ఎస్సీ కాలనీలోని ఎన్టీఆర్ నగర్ లో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ గత ఏడాది నుంచి మరమ్మత్తుల కారణంగా మూతపడింది ఇట్టి విషయాన్ని కాలనీవాసులు చైర్మన్ వైస్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే మరమ్మతులు చేయించి పునః ప్రారంభించారు ఈ సందర్భంగా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్ కుమార్ ఆర్టీసీ రాముడు మాలిక్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**టీ మీడియా, జూన్ 12 పెబ్బేరు:**



వనపర్తి జిల్లా శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టనం మండలంలోని తోమాలపల్లి కంచిరావుపల్లి రంగాపూర్ బునియాదిపురం గుమ్మడం యాపర్ల గ్రామాలకు చెందిన 30మంది లబ్దిదారులకు 876000 రూపాయల చెక్కులను అందజేసిన పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఇంటికి పెద్ద కొడుకులా నియోజకవర్గ ప్రజలకు కష్టసుఖాలలో తోడుండి నడిపిస్తున్న మేఘారెడ్డి వెంటే ఉంటామని మాట్లాడడం జరిగింది ఆయా గ్రామాల లబ్దిదారులు మేఘన్నకు జేజేలు పలుకుతూ ఎం ఎల్ ఎ మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి మండల అధ్యక్షులు యాపార్ల రాంరెడ్డి పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి తోమాలపల్లి గ్రామ సర్పంచ్ అశోక్ కుమార్ పెంచికలపాడు సర్పంచ్ జయన్న డైరెక్టర్ రామన్ గౌడ్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ కౌన్సిలర్ శివ సాయి వనం మల్లేష్ నరసింహ రజాక్ నరసింహ బుర్రమోని రాములు యాదవ్ రణధీర్ రెడ్డి మాజీ డైరెక్టర్ టి రాములు వినయ్ కుమార్ మాలపల్లి రంగన్న యాదవ్ యూత్ అధ్యక్షుడు శివకుమార్ జగదీశ్వర్ రెడ్డి రమణ ఆంజనేయులు శేఖర్ పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించనున్న బచ్ పన్ ప్లే స్కూల్

**టీ మీడియా , జూన్ 12, వనపర్తి బ్యూరో :**



విద్యాపర్తిగా పేరొంది దినదిన అభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం శుభసూచకం. విద్యార్థులకు విలువలతో కూడిన చదువు, సంస్కారం, తల్లిదండ్రులపై భక్తిశ్రద్ధలు ఉండేలా విద్యా బోధన చేయాలని దాంతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను రాణించేలా ప్రత్యేక దృష్టి సారించాలనే ఉద్దేశంతో వనపర్తి పట్టణంలో నూతనంగా బచ్ పన్ ప్లే స్కూల్ ఏర్పాటు చేశారు. తన సొంత ప్రాంతం మీద ఉన్న అభిమానంతో ఎంతో కొంత సేవ చేసుకోవాలన్న దృక్పథంతో ఈ పాఠశాలను మీరాసిపల్లి శ్రీనివాసులు ఆయన కుమారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని జంగిడిపురంలో విశాలమైన ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వాగ్దేవి జూనియర్ కాలేజ్ దగ్గర బచ్పన్ పే స్కూల్ ఏర్పాటు చేయడమైనది. ఈ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసం కోసం అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను అందిస్తోంది. కంప్యూటర్ ఃఐ సైన్స్ ల్యాబ్స్: అత్యాధునిక సాంకేతికతతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగాలు చేయడానికి సైన్స్ ల్యాబ్స్ ఉన్నాయి. విద్యార్థులు సులభంగా చదువును అర్థం చేసుకోవడానికి వీలుగా స్మార్ట్ బోర్డులు, గ్రంథాలయం, భారతీయ సంస్కృతి,నైతిక విలువలు, క్రమశిక్షణ, విద్యార్థుల శరీరక,మానసిక వికాసానికి క్రీడలు, కళాలకు ప్రాధాన్యతనిస్తారు. యోగ ఏసీ క్లాస్ రూములు సీసీటీవీ కెమెరాల నిఘా ఉంది. పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల నిర్వహణ కోసం ప్రత్యేక ఆడిటోరియం కలదు. జ్ఞానం, ఆవిష్కరణ, శ్రేష్ఠతతో, మేము పోటీలో పైచేయి సాధిస్తారు .అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో, ఆనందకరమైన అభ్యాసం, సృజనాత్మకత, అభివృద్ధి ద్వారా కలలు సాకారమవుతాయి. రోబోటిక్స్, క్రీడలు, జీవిత నైపుణ్యాలు ప్రతి విద్యార్థిని రేపటి ఆత్మవిశ్వాస నాయకుడిగా తీర్చిదిద్దుతాయి. 2026 -2027 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభం. ఈరోజే అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో చేరి, ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి!గొప్ప లక్ష్యాలను పెట్టుకోండి, కొత్త శిఖరాలను చేరుకోండి. అకడమిక్ హైట్స్‌కు స్వాగతం. మా 21వ శతాబ్దపు విద్యార్థుల మేధస్సును తీర్చిదిద్దడానికి స్మార్ట్ తరగతులు, రోబోటిక్స్ అనుభవపూర్వక అభ్యాసం. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మా పాఠశాల మీ కోసం ఎదురు చూస్తోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్య బోధన 2026-2027 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఈరోజే చేరండి చేర్పించండి.

# కాలుష్య కాసారంగా రాయగిరి చెరువు

**దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న భక్తులు**

**టి మీడియా, జూన్ 12 , యాదాద్రి :**
పరిశ్రమల వ్యర్థ జలాలు శుద్ధి చేశాకే బయటకు వదలాలి. ఇలా చేయటం వల్ల పర్యావరణం కాలుష్యం కాదు. ఇది తప్పకుండా చేయాల్సిన పని. ఎందుకంటే ఆ కలుషిత నీళ్లు జనాలు తాగే నీటిలో కలిసే అవకాశం ఉంటుంది. దీనివల్ల వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. అయితే యాదాద్రి జిల్లా భువనగిరిలోని ఓ పరిశ్రమలో మాత్రం అలాంటిదేం కనిపించడం లేదు. నిబంధనలకు నీళ్లొదులుతూ పరిశ్రమ నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను చెరువులోకి వదులుతున్నారు. ఫలితంగా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పుణ్యక్షేత్రమైన యాదగిరి గుట్టకు వచ్చే భక్తులకు సైతం ఇది ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

**విస్తరణ పనుల్లో భాగంగా వెలుగులోకి**
యాదాద్రి రైల్వే స్టేషన్‌కు సమీపంలో రాయగిరి చెరువు ఉంది. అక్కడే వేప నూనె, వేప పిండి వంటి ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమ ఉంది. ఈ ఉత్పత్తులను సేంద్రీయ పురుగు మందుల తయారీకి వినియోగిస్తారు. అయితే రైల్వే శాఖ ఆధ్వర్యంలో కొంతకాలంగా ఈ ప్రాంతంలో యాదాద్రి ఎంఎంటీఎస్?? ఫేజ్-2 విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడే వ్యర్థ



జలాలను నేరుగా రాయగిరి చెరువులోకి కలిపే అనుసంధాన వ్యవస్థ బయటపడింది.

**స్థానికుల ఆవేదన**
ఇన్నాళ్లూ అంతర్గతంగా ఉన్న ఈ పైప్‌లైన్ నుంచి సదరు కర్మాగారం గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను రాయగిరి చెరువులోకి వదిలిపెట్టేవారు. ప్రాజెక్టు పనులకు అడ్డంగా వస్తున్నాయని నీరు వెళ్లే దారిని రైల్వేశాఖ వారు మూసివేశారు. దీంతో నీరంతా రైల్వే పైవంతెన కిందకు చేరింది. ఈ నీరు నిల్వ ఉండటంతో విపరీతమైన దుర్వాసన వస్తోందని స్థానికులు, రైల్వే కార్మికులు ఈ విషయాన్ని ఈనాడు-ఈటీవీ భారత్? దృష్టికి తీసుకొచ్చారు. ముక్కుపుటాలు అదిరిపోయేలా వాసన, కళ్ల మంటతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులను దుర్వాసన ఉక్కిరిబిక్కిరి చేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నష్టపోతున్న రైతులు**
చెరువులో పరిశ్రమ వ్యర్థాలు చేరడంతో మేకలు, గొర్రెలు ఈ నీటిని తాగడం లేదని కాపరులు చెబుతున్నారు. 50 మంది రైతులు 100 ఎకరాల్లో ఈ చెరువు ఆయకట్టు కింద పంటలు సాగుచేస్తుండగా, ఈ నీరు భూగర్భ జలాల్లో ఇంకిపోతుండటంతో దిగుబడి తగ్గుతోందని చెబుతున్నారు. వరి వేస్తే తాలు, నూక ఎక్కువ శాతం వస్తోందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు**
పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను వాగులు, చెరువులు, వ్యవసాయ భూములు సహా భూగర్భంలోకి నేరుగా వదలకూడదు. ఈటీపీల ద్వారా వ్యర్థ జలాలను శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. అయినప్పటికీ అధికారుల పర్యవేక్షణ, నిరంతర తనిఖీలు మచ్చుకు కూడా కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం సంస్థ ఎస్టీపీలు ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అంటున్నారు

## దుబాయ్‌లో వడియారంవాసి గుండెపోటుతో మృతి

**టి మీడియా, జూన్ 12 , చేగుంట:**



గల్ఫ్ దేశమైన దుబాయ్‌లో విషాదం నెలకొంది. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన చింతకింది సాయి కిరణ్ (35) దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వడియారం గ్రామానికి చెందిన సాయికిరణ్‌కు కొన్నేళ్ల కిందట నాగలక్ష్మీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఉపాధి కోసం గత ఏడాది మే నెలలో సాయికిరణ్ దుబాయ్‌కు వెళ్లాడు. అయితే ఈ నెల 2వ తేదీ సాయికిరణ్‌కు గుండపోటు వచ్చి అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ఇటీవల ఇండియాలోని కుటుంబసభ్యులకు సమాచారం అందింది. సాయికిరణ్ మరణవార్త తెలియడంతో అతని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, దుబాయ్‌లో మరణించిన సాయికిరణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని సీఎం ప్రవాసీ ప్రజావాణిని బాధితులు సంప్రదించారు. వీలైనంత తొందరగా సాయికిరణ్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావాలని కోరారు.

## వర్షాకాలం ముందస్తు చర్యలపై వ్యాపారస్తులతో సమావేశం

- పారిశుద్ధ్యం పట్ల వ్యాపారస్తులు సహకరించాలి
- సర్పంచ్ మేదరి వీర ప్రతాప్

**టీ మీడియా,జూన్12,సింగరేణి(కారేపల్లి):**



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ), పంచాయతీ కార్యదర్శి బి. నెహ్రూ పాల్గొని వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చికెన్, మటన్ షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను రహదారుల పక్కన,బహిరంగ ప్రదేశాల్లో , గ్రామ శివార్లలో పడవేయవద్దని సూచించారు. వ్యర్థాల వల్ల దుర్వాసన వ్యాపించి పరిసరాలు కలుషితమవడంతో పాటు తాగునీటి వనరులు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్యం లోపిస్తే ప్రజలు వివిధ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే వాటర్ ప్లాంట్ యాజమానులు వర్షాకాలంలో నీటి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు. వాటర్ క్యాన్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని,నీటి రవాణా వాహనాలను మైనర్లకు అప్పగించవద్దని సూచించారు. ఈ సమావేశంలో వ్యాపారస్తులు గౌడుగు శ్రీను,బాజీ,కోటి,సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## మెరుగైన వైద్య సేవల కోసం ఎల్ఓసి

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, జూన్ 12, వనపర్తి బ్యూరో :**
గోపాల్ పేట్ మండలం తాడిపత్రి గ్రామానికి చెందిన శేఖర్ కూతురు లాస్య కు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రూ.2,50,000 ఎల్ఓసీని అందజేశారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని ఆలోచనతో ఎల్ఓసి అందజేస్తుందని , ఎల్ఓసి సహాయం బాధిత కుటుంబాలకుఎంతో ఊరట నిస్తుందని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తానని చిన్నారెడ్డి తెలిపారు. అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎల్ ఓ సి అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

**టీ మీడియా, జూన్ 12, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ నందు యాదవ సంఘం భవనంలో ఈ నెల 15 వ తేదీన జిల్లా స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన మహాసభకు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి గారు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఃఐ వనపర్తి డి సి సి శివసేన రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జూపల్లి అరుణ్ , ముఖ్య అతిథులుగా వస్తున్నారు కావున జిల్లాలో ఉండే వికలాంగుల అందరూ హాజరై సభను విజయవంతం చేయవలసిందిగా ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షులు ఎస్ భాను కుమార్,ఎన్పిఆర్డి వనపర్తి పట్టణ అధ్యక్షులు మధిర శ్రీశైలం, ఎన్పిఆర్డి ఇండియా జిల్లా అధ్యక్షులు చింతకుంట మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు మీసాల మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం బ్రేక్‌ఫాస్ట్, పాలు

- **6 నుంచి 10 తరగతులకు కొత్తగా అభ్యాస పుస్తకాలు**

**టి మీడియా, జూన్ 12 ,హైదరాబాద్ బ్యూరో :**



నూతన విద్యా సంవత్సరం (2026-27)లో ప్రభుత్వ పాఠశాలల బాగుకు వాటిల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పేద పిల్లల సంక్షేమానికి ఈసారి ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వనుంది. విద్యార్థుల సంఖ్యను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ విద్యాశాఖ, మే నెలలోనే బడిబాట కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ప్రతి పాఠశాలలో గతేడాది కంటే ఈసారి 10 శాతం విద్యార్థుల నమోదును పెంచాలని సంబంధిత టీచర్లకు లక్ష్యాన్ని నిర్దేశించింది. జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో కొత్త విద్యా సంవత్సరానికి ప్రభుత్వ సమాయత్తం, విద్యార్థుల కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తే ఇలా ఉన్నాయి.

**అటు వసతులు, ఇటు సంక్షేమం**

ఈ ఏడాది నుంచి కొత్తగా 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ప్రాక్టీస్ చేసేందుకు వర్క్‌బుక్స్ అందించనున్నారు. ఆగస్టు నెల నాటికి మొత్తం 9 వేల పాఠశాలలకు స్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తారు. విద్యార్థులకు రోజూ అల్పాహారంతో పాటు వారంలో మూడు రోజులపాటు నాణ్యమైన పాలు అందిస్తారు. పాఠశాలల పునఃప్రారంభం నాడే యూనిఫామ్‌లు, బూట్లు, బెల్ట్ ఇవ్వాలని భావించినా అది కొంత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్యూర్(హైదరాబాద్ కోర్ అర్బన్ రిజీయన్) పరిధిలోని పాఠశాలలకు సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్?బిలిటీ) నిధులతో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించనున్నారు. ఇప్పటికే పాఠ్య, నోట్ పుస్తకాలు ఆయా స్కూళ్లకు చేర్చామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు.

**కొలమానం పిల్లల సంఖ్యే**

ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం 20 వేల మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈసారి కనీసం 10 శాతం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2024-25లో 16.78 లక్షల మంది ఉండగా 2025-26లో ఆ సంఖ్య 16.58 లక్షలకు పడిపోయింది. 10 శాతమంటే దాదాపు 1.65 లక్షల మంది కొత్తగా చేరితేనే సర్కారు లక్ష్యం నెరవేరుతుంది. ఈసారి 2,769 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నందున వాటిల్లో దాదాపు 30 నుంచి 40 వేల మంది చేరే అవకాశం ఉందని టీచర్లు అంచనా వేస్తున్నారు.

**ఇలా చేయాలి**

ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో టీచర్లకు బోధనేతర పనులు అధికమవుతున్నాయి. బోధనకు సగం, అంతకంటే తక్కువే సమయం కేటాయిస్తున్నామని 25 శాతం మంది టీచర్లు అభిప్రాయపడినట్లు సమగ్రశిక్షా, హెచ్‌సీయూ, యునిసెఫ్ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. దసరాలోపు టీచర్లకు ఇచ్చే ట్రైనింగ్?లు పూర్తిచేసి తర్వాత బడిలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విద్యా నిపుణులు చెబుతున్నారు.

**ఇంకా లోపాలు ఉన్నాయి**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం మౌలిక సదుపాయాల ఆధునికీకరణ వైపు అడుగులు వేస్తున్నప్పటికీ, విద్యార్థుల చేరికలు తగ్గడం, ఉపాధ్యాయుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రభుత్వం ఒకవైపు విప్లవాత్మక మార్పుల కోసం ప్రయత్నిస్తుండగా, క్షేత్రస్థాయిలో ఇంకా కొన్ని లోపాలు ఇంకా కొనసాగుతున్నాయి.

రాష్ట్రంలో దాదాపు 27 వేల ప్రభుత్వ స్కూళ్లు ఉంటే కేవలం 16 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. అదే ప్రైవేటులో కేవలం 12వేల పాఠశాలలు ఉంటే 35 లక్షలకు పైగా విద్యార్థులు చదవడం గమనించాల్సిన విషయం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం నెలకు సగటున రూ. 9వేలు, ఏడాదికి సుమారు రూ. లక్షకు పైగా ఖర్చు చేస్తోంది. సంక్షేమ గురుకుల పాఠశాల హాస్టల్?లో ఉండే విద్యార్థులకు కేవలం వసతి కిందనే ఒక్కొక్కరిపై నెలకు సగటున రూ.4,223ల ఖర్చు చేస్తోంది. అయినా కూడా విద్యార్థులకు అక్కక్కడా ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకున్న ఉదంతాలున్నాయి.

# సరిహద్దులో కొత్త ఉద్రిక్తత..

- **భారత్‌కు వ్యతిరేకంగా జమాతే ఇస్లామ్ పోరు!**

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**



భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు అంశం మరోసారి ఉద్రిక్తతలకు దారితీస్తోంది. భారతదేశం బలవంతంగా బంగ్లాదేశ్ పౌరులను సరిహద్దు దాటించి తమ దేశంలోకి పంపిస్తోందని ఆరోపిస్తూ, బంగ్లాదేశ్ జమాతే-ఈ-ఇస్లామ్ నేతృత్వంలోని 11 పార్టీల కూటమి సరిహద్దు ప్రాంతాల్లో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. శుక్రవారం (జూన్ 12) సరిహద్దు జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించనున్న ఈ కూటమి, జూన్ 15న రాజధాని ఢాకాలో భారీ నిరసన సభ, ఊరేగింపు చేపట్టనున్నట్లు ప్రకటించింది. జమాత్ నేతలు భారత్ అక్రమంగా బంగ్లాదేశ్ పౌరులను తిరిగి పంపిస్తోందని, అలాగే బీఎస్ఎఫ్ కాల్పుల్లో బంగ్లాదేశ్ పౌరులు మరణిస్తున్నారని ఆరోపించారు. గత మూడు నెలల్లో సరిహద్దు వెంబడి 50కిపైగా "పుష్-ఇన్" ఘటనలు జరిగాయని, సుమారు 2,479 మందిని బంగ్లాదేశ్‌లోకి పంపేందుకు ప్రయత్నించారని జమాత్ నాయకుడు ఏహెచ్‌ఎం హమీదుర్ రెహమాన్ ఆజాద్ పేర్కొన్నారు. ఇదే సమయంలో హసీనా వ్యతిరేక ఉద్యమం నుంచి ఎదిగిన ఎన్‌సీపీ కూడా ఈ నిరసనలకు మద్దతు ప్రకటించింది. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలు మానవ కవచంగా ఏర్పడి అక్రమ ప్రవేశాలు, బలవంతపు తరలింపులను అడ్డుకోవాలని ఎన్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. అయితే ఈ ఆరోపణలను భారత్ పూర్తిగా ఖండిస్తోంది. అక్రమంగా భారత్‌లో నివసిస్తున్న విదేశీ పౌరులను మాత్రమే చట్టబద్ధమైన విధానాలు, ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం స్వదేశానికి పంపుతున్నామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సరైన గుర్తింపు, ధృవీకరణ అనంతరమే చర్యలు చేపడుతున్నామని తెలిపింది. ఇటీవల న్యూఢిల్లీలో బీజీబీ, బీఎస్ఎఫ్‌ల మధ్య జరిగిన డైరెక్టర్ జనరల్ స్థాయి సమావేశాల్లో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. సుమారు 4,096 కిలోమీటర్ల పొడవైన భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు నేపథ్యంలో ఈ వివాదం ఇరు దేశాల మధ్య కీలక అంశంగా మారింది. దౌత్యస్థాయిలో చర్చలు కొనసాగుతున్నప్పటికీ, జమాత్ నేతృత్వంలోని కూటమి వీధి పోరాటానికి సిద్ధమవుతుండటంతో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.




## షూటర్ జస్పాల్ రాణా మృతి పట్ల

# ప్రధాని మోదీ సంతాపం

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**

ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, షఉటర్ జస్పాల్ రాణా మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం భారత క్రీడా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. 49 ఏళ్ల రాణా గురువారం రాత్రి ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. "శ్రీ జస్పాల్ రాణా జీ మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. ఆయన మరణం భారత క్రీడా రంగానికి తీరని లోటు," అని మోదీ శ వేదికగా పేర్కొన్నారు.పలు ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల స్వర్ణ పతకాల విజేత, భారత షఉటింగ్ దిగ్గజం జస్పాల్ రాణా గురువారం రాత్రి 49 ఏళ్ల వయసులో మరణించారు. ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో రాణా తుదిశ్వాస విడిచారని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కలికేష్ నారాయణ్ సింగ్ డియో ధృవీకరించారు. జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ నుండి భారత బృందం తిరిగి వస్తున్న విమానంలో అస్వస్థతకు గురైన తర్వాత ఇటీవల వైద్య చికిత్స చేయించుకున్న రాణా మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.భారత పిస్టల్ షఉటర్లకు హై-పెర్ఫార్మెన్స్ కోచ్‌గా పనిచేస్తున్న రాణా, తిరుగు ప్రయాణంలో అస్వస్థతకు గురయ్యారు. గత వారం ఢిల్లీలో దిగిన వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లారు. జూనియర్ జాతీయ జట్టు కోచ్‌గా, హై-పెర్ఫార్మెన్స్ ట్రైనర్‌గా తన పాత్రల ద్వారా భారత షఉటింగ్ క్రీడలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినందుకు రాణా ప్రసిద్ధి చెందారు. ఆయన మను భాకర్‌కు మార్గదర్శకత్వం వహించి, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె చారిత్రాత్మక డబుల్ కాంస్య పతకాన్ని సాధించడంలో సహాయపడ్డారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణకు మందకృష్ణ మాదిగ

- **ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు మాదిగ**

**టీ మీడియా, జూన్ 12, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా పానగల్ మండలం జమ్మాపూర్ గ్రామంలో నిర్వహించనున్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి శు క్రవారం ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా కమిటీ నాయకులు గురువారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగని కలిసిన సంగతి తెలిసిన విషయం విగ్రహావిష్కరణకు జిల్లా కమిటీ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. జమ్మాపూర్ గ్రామంలో నిర్వహించనున్న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరగా, కార్యక్రమానికి హాజరవుతానని మందకృష్ణ మాదిగ ప్రకటనలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డాక్టర్




బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడం, సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవ సాధన కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనలు సామాజిక మార్పుకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్గదర్శకాలని, యువత ఆయన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య, మొలకలపల్లి పరుశు రాముడు మాదిగ, ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు, జమ్మాపూర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రం రాములు, ఎర్రం చంద్రయ్య, ఎర్రం గోవిందు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా. ఎర్రం నాగేంద్రం, మాజీ ఎంపీటీసీ సభ్యులు కురుమయ్య, వర్మ మాదిగ, ఎమ్మార్పీఎస్ వనపర్తి మండల అధ్యక్షులు మచ్చ తిరుపతి మాదిగ, గొర్ల ఆంజనేయులు, శ్రీను, ఇ రాములు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జమ్మాపూర్ గ్రామంలో నిర్వహించనున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి

- **కాంగ్రెస్ బలంగా ఉన్న చోట తొలగింపునకు కుట్ర**
- **బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి**

**టి మీడియా , జూన్ 12,ఖమ్మం రూరల్ :**

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!**

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి



ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**సీట్లే దొంగిలిస్తున్నారు**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు.

**బెదిరింపు రాజకీయాలు**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 18న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల ఉపవాస దీక్ష

**టి మీడియా, జూన్ 12 ,హైదరాబాద్ బ్యూరో :**




ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు పెండింగ్ బకాయిలపై 'ఒక్కరోజు ఉపవాస దీక్ష'కు పిలుపునిచ్చారు. కొన్నేండ్లుగా బకాయి ఉన్న రిటైర్మెంట్ పెన్షన్ స్కీమ్ (ఆర్పీఎస్)-2017, 2021 ఏరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు, గ్రాట్యుటీ డిఫరెన్స్ డబ్బులు రిటైర్ అయిన వారందరికీ అర్హత చొప్పన ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు రావాల్సిన వాటిని ఇప్పించాలని ఎంతమంది దగ్గరకు వెళ్లినా పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారథ్య కమిటీ చెబుతున్నది. హైదరాబాద్ వార్తలువివిధ కారణాలతో తిరసరించిన పీఎఫ్ అప్లికేషన్లు సరిచేయడం లేదని మండిపడుతున్నారు. రిటైర్ అయినవారికి పెన్షన్ సాంక్షన్ కావడం లేదని, కొందరికి డిమాండ్ నోటీసులు రావడం లేదని చెప్తున్నారు. 2013, 2017 వేతన సవరణ వివరాలను పీఎఫ్ కమిషనర్‌కు పంపకపోవడం వల్ల హయ్యర్ పెన్షన్ ఆగిపోయిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులందరి సలహాలు, సూచనల మేరకు జూన్ 18న బస్‌భవన్ వద్ద 10వేల మందికి పైగా ఒకరోజు ఉపవాస దీక్షలో పాల్గొంటారని తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారథ్య కమిటీ తెలిపింది.

# కానిస్టేబుల్ హత్య కేసులో జీవితఖైదు..

- **పోలీసుల కళ్లుగప్పి పరారైన ఖైదీ**

**టి మీడియా, జూన్ 12 , కడప :**



కడప సెంట్రల్ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న ఖైదీ రాజశేఖర్ పరారయ్యాడు అనారోగ్య కారణాల వల్ల ఏప్రిల్ నెలలో విశాఖ మానసిక ఆస్పత్రికి తరలించి, తిరిగి జైలుకు తరలిస్తుండగా గూడూరు రైల్వే స్టేషన్‌లో తప్పించుకుని పారిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని కాచిగూడకు చెందిన రాజశేఖర్ కొంతకాలం కిందట నంద్యాలకు వచ్చాడు. పట్టణంలోని రౌడీషీటర్లతో పరిచయాలు పెంచుకుని పలు దందాలు చేశాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతనిపై పోక్సో కేసు కూడా నమోదైంది. ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో ఏ2గా ఉన్న రాజశేఖర్‌కు కొంతకాలం కిందట జీవితఖైదు పడింది. ఈ క్రమంలో కడప సెంట్రల్ జైలులో అతను శిక్ష అనుభవిస్తున్నాడు. రాజశేఖర్ మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తుండటంతో జైలు అధికారులు చికిత్స నిమిత్తం అతన్ని విశాఖపట్నంలోని మెంటల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందిన రాజశేఖర్‌నున వైజాగ్ నుంచి కడపకు తరలిస్తుండగా గూడూరు రైల్వే స్టేషన్లో పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని పారిపోయాడు. అతను నంద్యాలకు వచ్చి ఉంటాడేమోనన్న అనుమానంతో పోలీసులు అలర్ట్ అయ్యారు.

## ముక్కుపుడక, కన్నులు చేయించిన మున్సిపల్ వైస్ చైర్మన్

**టీ మీడియా ,జూన్ 12 ,ఆత్మకూర్:**



వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహానికి ముక్కుపుడక, రెండు కన్నులు బంగారుతో చేయిస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు మొక్కుకున్నాడు. అటి మొక్కు లో భాగంగా నేడు సాయంత్రం పెద్దమ్మ గుడికి చేరుకొని ,అమ్మవారికి ముక్కుపుడక, రెండు కన్నులు అలంకరించడం జరిగింది. అమ్మవారి దయవలన ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దీవెనలు ఆత్మకూరు పట్టణ ప్రజలు అందరికీ ఉండాలని కోరుకున్నారూ. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎయిరిండియా ఘోర ప్రమాదానికి ఏడాది..

- **ఇంకా వీడని మిస్టరీ.. నివేదికపై ఉత్కంఠ..**

**టి మీడియా, జూన్ 12 , ఢిల్లీబ్యూరో :**

"మేడే.. మేడే.. మేడే.."సరిగ్గా ఏడాది క్రితం.. 2025 జూన్ 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ రన్‌వే నుండి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా 171 విమాన పైలట్ నుండి వచ్చిన ఆఖరి ఆర్తనాదం ఇది. టేకాఫ్ అయిన కేవలం మూడు సెకన్లలోనే కాక్‌పిట్‌లోని రెండు ఫ్యూయల్ స్విచ్‌లు ఆగిపోయి, ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. మరో ముప్పై సెకన్లలో ఆ భారీ విమానం సమీపంలోని మెడికల్ హాస్టల్ కాంప్లెక్స్‌పై కుప్పకూలింది. ఈ దారుణ ఉదంతంలో 260 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. విమానంలో ఉన్న 242 మందిలో కేవలం ఒక్కరంటే ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడగా, భూమిపై ఉన్న మరో 19 మంది అమాయకులు బలయ్యారు. 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో సంభవించిన ఆ అగ్నిప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోవడంతో, గుర్తింపు ప్రక్రియకు వారాల తరబడి డిఎన్ఏపరీక్షలు చేయాల్సి వచ్చింది. 1996 నాటి చర్ఖీ దాద్రి ప్రమాదం తర్వాత భారతదేశంలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన విపత్తు ఇదే. నేడు ఈ దారుణ ఘటన జరిగి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈ ప్రమాదం వెనుక ఉన్న అసలు రహస్యంపై అంతర్జాతీయ ఏవియేషన్ రంగంలో ఉత్కంఠ రేపుతోంది.

**రెండు పీడకలల సిద్ధాంతాలు**

గడిచిన ఏడాది కాలంగా ఎయిర్ ఇండియా 171 ప్రమాదం రెండు ప్రధాన సిద్ధాంతాల చుట్టూ తిరుగుతోంది. ఈ రెండూ కాక్‌పిట్‌లోని ఆ రెండు ఫ్యూయల్ కటాఫ్ స్విచ్‌ల కదలికతోనే ముడిపడి ఉన్నాయి.

**మొదటిది -- మానవ తప్పిదం**

టేకాఫ్ అయిన వెంటనే పైలట్లలో ఎవరో ఒకరు ఉద్దేశపూర్వకంగానో లేదా పొరపాటునగానో ఆ ఫ్యూయల్ స్విచ్‌లను ఆపేశారనేది ఒక వాదన. సాధారణంగా ఈ స్విచ్‌లు రక్షణ కవచంతో ఉండి అంత సులభంగా ఆపడానికి వీలుండదు. కాబట్టి ఇందులో మానవ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

**రెండూ - సాంకేతిక లోపం**

అత్యాధునిక బ్యాకప్ సిస్టమ్స్ ఉన్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో తీవ్రమైన ఎలక్ట్రికల్ లేదా మెకానికల్ లోపం తలెత్తి, అత్యంత కీలకమైన సమయంలో ఇంధన సరఫరాను నిలిపివేసిందనేది రెండో వాదన.

**ప్రాథమిక నివేదిక వెల్లడించిన షాకింగ్ నిజాలు**

గతేడాది జూలై 12న లీకైన ప్రాథమిక నివేదిక ప్రకారం.. టేకాఫ్ అయిన మూడు సెకన్లలోనే ఇంజన్ 1, ఇంజన్ 2 ఫ్యూయల్ స్విచ్‌లు కేవలం ఒక సెకను వ్యవధిలో రన్ నుండి కటాఫ్ మోడ్‌లోకి మారిపోయాయి. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలట్ "నువ్వు స్విచ్‌లు ఎందుకు కట్ చేసావ్?" అని అడగగా.. రెండో పైలట్ "నేను చేయలేదు" అని సమాధానం ఇచ్చినట్లు రికార్డ్ అయింది. ఆ తర్వాత స్విచ్‌లను మళ్లీ రన్ మోడ్‌లోకి తెచ్చినప్పటికీ, అప్పటికే విమానం వేగాన్ని, ఎత్తును కోల్పోయి కూలిపోయింది.

**రంగంలోకి బోయింగ్.. కొత్త ట్విస్టులు**

ఈ ప్రమాదం అమెరికాకు చెందిన విమాన తయారీ దిగ్గజం బోయింగ్, ఎయిర్ ఇండియా ప్రతిష్టలను పణంగా పెట్టింది. ఒకవేళ పైలట్ తప్పిదమైతే చనిపోయిన పైలట్లను సమర్థించుకునేవారు లేరు. అదే సాంకేతిక లోపమైతే బోయింగ్ సంస్థ బిలియన్ల డాలర్ల నష్టపరిహారంతో పాటు వందలాది డ్రీమ్‌లైనర్ విమానాలను నిలిపివేయాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో కొన్ని నెలల క్రితం లండన్-బెంగళూరు రూట్‌లో వెళ్తున్న మరో ఎయిర్ ఇండియా 787 విమానంలో కూడా ఇలాంటి ఫ్యూయల్ స్విచ్ లాచ్ సమస్య తాత్కాలికంగా తలెత్తడం ఈ అనుమానాలకు మరింత బలాన్నిచ్చింది. ప్రస్తుతం ఆ విమాన స్విచ్ యూనిట్‌ను భారత ఏవియేషన్ నిపుణుల సమక్షంలో పరీక్షించడానికి అమెరికాలోని బోయింగ్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. గతంలో బోయింగ్ 737 గరిష్ఠ విమానాల కంట్రోల్ సాఫ్ట్‌వేర్ వివాదంలో బోయింగ్ ప్రవర్తనను గుర్తుచేస్తూ చాలా మంది నిపుణులు సాంకేతిక లోపం వైపే మొగ్గు చూపుతున్నారు.



**రెండు ప్రమాదాల గుణపాఠాలు**

భారతదేశానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఈ దర్యాప్తును నడిపిస్తోంది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం ఏడాది పూర్తయిన సందర్భంగా ఎ ఎ ఐ బి ఈరోజు తుది నివేదికను గానీ, లేదా తాత్కాలిక పురోగతి నివేదికను గానీ సమర్పించాల్సి ఉంది. అయితే చరిత్రలో మిగిలిపోయిన రెండు ప్రమాదాలు మనకు హెచ్చరికలుగా నిలుస్తున్నాయి.

**చైనా ఈస్టర్న్ ఫ్లైట్ 5735 (2022)**

ఈ ప్రమాదం జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా చైనా పూర్తి నివేదిక ఇవ్వకుండా దాటవేస్తోంది. ఇటీవల అమెరికా ఎన్ టి ఎస్ బి డేటా లీక్ చేస్తూ అది పైలట్ చర్యేనని చెప్పే వరకు అసలు విషయం బయటకు రాలేదు. నిశబ్దం అనేది దర్యాప్తును నిర్వీర్యం చేస్తుందనడానికి ఇది ఉదాహరణ.

**ఈజిప్ట్ ఎయిర్ ఫ్లైట్ 990 (1999)**

అమెరికా దర్యాప్తు సంస్థ ఇది పైలట్ ఆత్మహత్య అని చెబితే, ఈజిప్ట్ ప్రభుత్వం దాన్ని తిరస్కరించి యాంత్రిక లోపమని వాదించింది. ఇలాంటి పరస్పర విరుద్ధ ముగింపులు ఏవియేషన్ రంగానికి పెద్ద శాపాలు. ఎయిర్ ఇండియా 171 ప్రమాదానికి కారణం మానవ తప్పిదమైతే పైలట్ల మానసిక ఆరోగ్యం, కాక్‌పిట్ నిబంధనలపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సాంకేతిక లోపమైతే వందలాది బోయింగ్ విమానాల రీ డిజైనింగ్ చేయాల్సి వస్తుంది. కారణం ఏదైనా కావచ్చు, విమాన ప్రయాణాల భద్రత అనేది ఎప్పుడూ కఠినమైన నిజాల పైనే నిర్మించబడుతుంది. ఈ వార్షికోత్సవం వేళ, బాధితుల కుటుంబాలకు కావాల్సింది ఊహాగానాలు కావు.. నిజమైన, పారదర్శకమైన సమాధానం.

# తుగ్లకాబాద్ భవనంలో అగ్నిప్రమాదం..

మొదటిపేజీ తరువాయి....

కారణంగా బయటకు రావడం కష్టంగా మారినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొని, భవనంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఢిల్లీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, దీనిపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదు. అగ్నిమాపక శాఖ, పోలీసులు కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో తుగ్లకాబాద్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు రాజధానిలో భవన భద్రత, అగ్నిమాపక ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఘటనపై పూర్తి వివరాలు, మరణించిన వారి గుర్తింపు, ప్రమాదానికి గల అసలు కారణాలు దర్యాప్తు పూర్తైన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భవనాల్లో అగ్నిభద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.